## క్లుప్తంగా

### నానో డీఏపీ వాడకంపై రైతులకు అవగాహన



గన్నవరం: ఉంగుటూరు మండలం పొణుకుమాడు గ్రామంలో సోమవారం వ్యవసాయ శాఖ, ఇఫ్‌కో సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నానో డీఏపీ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇఫ్‌కో సంస్థ జిల్లా మేనేజర్ జీ నందకిషోర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం 50 కేజీల డీఏపీ ధర రూ. 1,350 ఉండగా, నానో డీఏపీ అరలీటర్ రూ. 600 మాత్రమేనని చెప్పారు. విత్తనశుద్ధి చేయడానికి కూడా నానో డీఏపీని వాడవచ్చని తెలిపారు. లీటర్ నీటిలో 4 నుంచి ఐదు మిల్లీ గ్రాముల నానో డీఏపీ కలిపిన ద్రావణంలో వరి నాట్లు ముంచిన తర్వాత నాట్లు వేయాలని సూచించారు. దీని వల్ల వేరు వ్యవస్థ బలంగా పెరిగి వరి దుబ్బు అధికంగా చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జీ రమేష్, వీఏఏ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### 8 మంది జూదరుల అరెస్టు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. యనమలకుదురు హోసన్న మందిరం సమీపంలో కొందరు కోతముక్క ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ.ప్రసాద్ సిబ్బందితో దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 10,700 సొమ్ము స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేశారు.

### నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

కంకిపాడు: ఉప్పలూరు పీఏసీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం ఉప్పలూరులో నిర్వహించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సమక్షంలో సొసైటీ చైర్మన్‌గా పడవల మధుసూదన్‌రావు, డైరెక్టర్లుగా పరసా సురేష్, వెంగల దుర్గాభవానీ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, పెనమలూరు ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ దేవినేని రాజా తదితరులు పాల్గొన్నారు.

### వాహనాలకు జీపీఎస్ అమర్చాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చోరీలు అరికట్టేందుకు యజమానులు తమ వాహనాలకు జీపీఎస్ పరికరాన్ని అమర్చుకోవాలని ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ, సురక్ష కమిటీ కన్వీనర్ నరసయ్య తెలిపారు. విజయవాడలోని ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు ఎస్ కన్వెన్షన్‌లో సురక్ష కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీపీఎస్ పరికరాలు అమర్చడం వల్ల వాహనం చోరీకి గురైనప్పుడు పట్టుకునేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. కాలేజీలు, స్కూల్స్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ కెమెరాలతో ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేశారు. అలాగే ఆకతాయిల ఆటకట్టేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ట్రాక్టర్ చోరీ కేసును సీసీ కెమెరాల ఆధారంగా కనుగొన్న విషయాన్ని గుర్తు చేశారు. భవానీపురం స్టేషన్ పరిధిలో నేరాలు అదుపులోకి వచ్చాయని వెల్లడించారు. శాంతిభద్రతలు అదుపులోకి వచ్చాయన్నారు. గంజాయి సేవించి గొడవలు పడే వారిపై చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. సమావేశంలో ఏసీపీ దుర్గారావు, సీఐలు ఉమామహేశ్వరరావు, చంద్రశేఖర్, గురు ప్రకాష్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీనివాసునికి పంచామృత అభిషేకం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారికి సోమవారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో భోగ నివాసునికి ఆలయ అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామి వారికి వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. పూజా కార్యక్రమాల అనంతరం పంచ హారతుల సేవ నిర్వహించారు.

### అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం కనకదుర్గమ్మ అమ్మవారికి సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, పండ్లు, గాజులు, చీరలు, రకరకాల స్వీట్స్ తీసుకువచ్చి అమ్మవారి విగ్రహం ముందు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఆషాఢ మాసంలో తాము సమర్పించిన సారెను స్వీకరించి అనుగ్రహించాలని వేడుకున్నారు. తమ ఇంటి ఆడబిడ్డగా భావించి సమర్పించిన పుట్టింటి సారెతో సంతృప్తిచెంది ఆశీర్వదించాలని ప్రార్థించారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణ చేశారు.

# గాడి తప్పిన పాలన

- కమిషనర్ కుర్చీ ఖాళీ
- అస్తవ్యస్తంగా ఉయ్యూరు నగర పంచాయతీ
- కొత్త కమిషనర్ కోసం ఎదురుచూపులు



ఉయ్యూరు నగర పంచాయతీ కార్యాలయం

ఉయ్యూరు: ఉయ్యూరు నగర పంచాయతీలో పాలన గాడి తప్పుతోంది. గత ఇరవై రోజులుగా కమిషనర్ కుర్చీ ఖాళీగా ఉండటంతో పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇన్‌చార్జి కమిషనర్‌తోనే కాలం వెళ్లదీస్తున్న పరిస్థితి. కొందరు అధికారుల పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగా ఉండటంతో ఎవరి ఇష్టం వారిదే అన్న చందంగా మారింది. మున్సిపల్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ప్రజలకు సత్వర సేవలు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ప్రజల గోడు వినే నాథుడే లేడు**

నగర పంచాయతీ కమిషనర్‌గా పనిచేసిన పాయసం వెంకటేశ్వరరావు ఇరవై రోజులు క్రితం పదవీ విరమణ చేశారు. ఇన్‌చార్జి కమిషనర్‌గా ఏఈ రమ్యను నియమించారు. ఇరవై రోజులు గడుస్తున్నా కొత్త కమిషనర్ నియామకం చేపట్టకపోవడంతో అంతా అస్తవ్యస్తంగా తయారైంది. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పూర్తిగా సమయపాలన మరిచారు. సమస్యలపై నగర పంచాయతీ, వార్డు సచివాలయాలకు వచ్చే ప్రజల గోడు వినే నాథుడు లేకుండా పోయారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా పోతున్నా పరిష్కారం చూపించే అధికారి కరువయ్యారు. ప్రధాన రహదారుల వెంబడి వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. దీపాలు సరిగా వెలగక, రాత్రిళ్లు రోడ్లపై చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయి. దీంతో పట్టణానికి చెందిన పలు వార్డుల్లో ప్రజలు రాకపోకల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీల్లో మురుగు తొలగింపు, పారిశుద్ధ్య నిర్వహణ ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. మురుగు నిలిచిపోయి దోమలు విజృంభించడంతో కంటి మీద కునుకు కరువై పట్టణవాసులు అల్లాడుతున్నారు. దోమల నిర్మూలన చర్యలు అంతా తూతూమంత్రంగా సాగుతుండటంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. పర్యవేక్షణాధికారి లేకపోవడం ఒక కారణమైతే ఐదేళ్లుగా పూర్తి స్థాయి శానిటరి ఇన్‌స్పెక్టర్ లేకపోవడం కూడా మరో కారణం.



ఖాళీగా దర్శనమిస్తున్న కమిషనర్ కుర్చీ

**కమిషనర్ నియామకంలో జాప్యం**

కమిషనర్ నియామకం వ్యవహారం రసకంధాయంగా మారింది. కమిషనర్ నియామకం విషయంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆచితూచి అడుగులు వేస్తున్న పరిస్థితి. చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) తనకు అనుకూలంగా ఉండే కమిషనర్ కోసం పావులు కదుపుతున్నట్లు సమాచారం. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ కమిషనర్‌ను తిరిగి మరలా ఇక్కడకు తెచ్చుకోవాలని పాలకవర్గం పట్టు మీద ఉంది. టీడీపీలోని ఓ వర్గం ఎమ్మెల్యే కనుసన్నల్లో ఉండే కమిషనర్‌ను నియమించాలని పట్టుబడుతోంది. దీంతో కమిషనర్ నియామక వ్యవహారం నానాటికీ జాప్యం అవుతోంది. కొత్త ముఖాన్ని కమిషనర్‌గా పరిచయం చేసేందుకు ఎమ్మెల్యే ప్రసాద్ కసరత్తు చేస్తున్నట్లు వినికిడి. టీడీపీలో నెలకొన్న విభిన్న పరిస్థితులు కారణంగా కొత్త కమిషనర్ నియామకం ఎప్పుడు జరుగుతుంది అన్నది? ప్రశ్నగా మారింది.

**సందట్లో సడేమియా**

మున్సిపాలిటీలో జరుగుతున్న పరిణామాలు అన్నీ ఇన్నీ కావు. కమిషనర్ పదవీ విరమణ ముందు మూడు నెలల నుంచే పెండింగ్ బిల్లులు క్లియరెన్స్ శరవేగంగా సాగింది. కొత్త కమిషనర్ వచ్చే లోపు మిగతా బిల్లులు క్లియర్ చేసుకునే పనిలో ఉన్నారు. ఆయా శాఖల అధికారులు 'ఎస్ బాస్' అంటూ పెట్టిన బిల్లులకు ఆమోదం తెలుపుతూ బిల్లులు క్లియర్ చేసేందుకు పచ్చ జెండా ఊపుతున్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న పరిణామాలపై ఓ వ్యక్తి ఏసీబీ అధికారులకు లేఖ రాయడం గమనార్హం. సామాజిక కార్యకర్త ఒకరు మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులకు, లోకాయుక్తకు ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

# పనిభారం తగ్గించాలని అంగన్‌వాడీలు ఆందోళన

గన్నవరం: పని భారం తగ్గించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని.. పని ఒత్తిడి తగ్గించాలని అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకురాలు కనకదుర్గ మాట్లాడుతూ.. తీవ్రమైన పని ఒత్తిడి కారణంగా అంగన్‌వాడీలు అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. ఆరోగ్యం దెబ్బతిన్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం అందడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు పనిచేయకపోవడం వల్ల సమాచారం అప్‌లోడ్ చేయడం కష్టతరంగా మారిందని పేర్కొన్నారు. హోమ్ రేషన్, ఇతర సేవల కోసం ఎస్ఆర్ఎస్ ధ్రువీకరణ చేసే నిబంధనలను నిలిపివేయాలని కోరారు. వేగవంతమైన ఇంటర్‌నెట్ కలిగిన సెల్‌పోన్లు అందజేయడంతో పాటు డేటాకు సరిపడా నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు నాగలక్ష్మి, ఖాదర్‌బీ, సీఐటీయూ నేతలు కే వెంకటేశ్వరరావు, తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు





కంకిపాడులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

**కనీస వేతనం అమలు చేయాలి**

కంకిపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నేత తాడంకి నరేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కంకిపాడులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. నరేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్, బాలింతలు, చిన్నారులకు ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యాప్‌ల భారం నుంచి కార్యకర్తలకు ఉపశమనం కల్పించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను అంగన్‌వాడీలకు వర్తింపచేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు వై.నళినీకుమారి, ప్రతినిధులు రమా, విజయలక్ష్మి, హస్నాబి, కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

# యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



యోగా పోటీల్లో గెలుపొందిన పోరంకి విద్యార్థినులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శివాజీబాబు

పెనమలూరు: జిల్లా స్థాయి యోగా పోటీల్లో పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారు. ఈ నెల 19వ తేదీన జిల్లా స్థాయి యోగా పోటీలు గండిగుంట దత్తా కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ పోటీల్లో 14 ఏళ్ల లోపు విభాగంలో పోరంకి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కన్నూరి శివలక్ష్మి, గంగవరపు పవన పూజిత ప్రథమ, ద్వితీయ స్థానంలో సత్తాచాటారు. తృతీయ స్థానంలో కొమరవోలు ఐశ్వర్య, వి.రిషిత వచ్చారు. కాగా ప్రథమ స్థానం వచ్చిన శివలక్ష్మి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా సోమవారం ఎంఈఓ కనకమహాలక్ష్మి, హెచ్ఎం సుమలత, యోగా టీచర్ బి.శ్రీలలిత అభినందనలు తెలిపారు.

**పతకాలు సాధించిన సిద్ధార్థ విద్యార్థులు**

కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు జిల్లా స్థాయి యోగా పోటీల్లో పతకాలు సాధించారు. ఎన్టీఆర్ జిల్లా స్థాయి యోగా పోటీలు ఆదివారం పటమటలో నిర్వహించారు. ఈ పోటీల్లో 18 – 28 ఏళ్ల విభాగంలో కేతా నేహారెడ్డి, జి.వసుంధర, టి.జగదీష్ బంగారు పతకాలు సాధించారు. భుక్యా ఈశ్వరి రజత పతకం గెలిచింది. ఈ మేరకు కాలేజీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ఫిజికల్ డైరెక్టర్ సాంబశివరావు అభినందనలు తెలిపారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మర్లపాలెం హౌసింగ్ కాలనీ, తెంపల్లి, బల్లిపర్రు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల ఈఈ పి. హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

**పోరంకిలో...**

పెనమలూరు: పోరంకి ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. సాలిపేట, పెనమలూరు సెంటర్, ఏపీఎం గార్డెన్స్, సీతాపురంకాలనీ, బందరు రోడ్డు, శ్రీనివాసానగర్ కాలనీ, కృష్ణవేణి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

**కానూరులో..**

మురళీనగర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి 12 గంటల వరకు కానూరులోని వినాయక్‌నగర్, నవతా రోడ్డు, కేసీపీ పాఠశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ హరిబాబు తెలిపారు.

# స్మార్ట్ మీటర్ల ఏర్పాటు రద్దు చేయాలి

కంకిపాడు: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో స్మార్ట్ మీటర్లు రద్దు, ట్రూ అప్ చార్జీల ఉపసంహరణపై సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణకు కుట్ర జరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనంపై భారాలు మోపుతున్నాయని విమర్శించారు. ట్రూ అప్‌చార్జీల పేరుతో ప్రజల రక్తాన్ని పీల్చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ దోపిడీపై మరో విద్యుత్ ఉద్యమం చేపట్టాల్సిన అవసరం వచ్చిందని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే ప్రమాదం, భారాలపై ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్మార్ట్ మీటర్లను పాలకులు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ నేత తాడంకి నరేష్, ప్రజాసంఘాల ప్రతినిధులు పోతురాజు నాగేశ్వరరావు, పాశం రవి, జి.కుమారి, వి.శివశంకర్, వి.మరియదాసు, ఎం.చంటిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

### పీ-4 సర్వేపై గ్రామసభ

నున్న(విజయవాడరూరల్): పీ–4 సర్వేపై నున్న గ్రామంలో సోమవారం సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని మూడు సచివాలయాల పరిధిలో గుర్తించిన పేదల జాబితాలను సిబ్బంది వినిపించారు. సర్వేలో నిజమైన పేదల పేర్లు లేవని, ధనవంతులను పేదలుగా చూపిస్తూ జాబితాలను తయారు చేసినట్లు ఏఎంసీ మాజీ సభ్యుడు, దండు సుబ్రహ్మణ్యం రాజు, పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామ సభలో సొసైటీ చైర్మన్ కలకోటి శ్రీనివాసురెడ్డి, డైరెక్టర్ గంపా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు కోట సురేష్, సర్వాంగి, వార్డు సభ్యుడు వి.వెంకటశివ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# నీట మునిగిన వరి పొలాలు

- ఆర్థికంగా నష్టపోయామంటున్న అన్నదాతలు
- నారు కుళ్లి పోయే ప్రమాదం ఉందని ఆందోళన



చోడవరంలో చెరువును తలపిస్తున్న వరి పొలాలు

కంకిపాడు: మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరి పొలాలు నీట మునిగాయి. పంట కాలువలు పొలం గట్లు తాకుతూ ప్రవహిస్తున్నాయి. పొలాల్లోని మురుగునీటిని బోదెల్లోకి తరలించే మార్గం లేకపోవడంతో పొలాలు ముంపులోనే ఉన్నాయి. సాగు మొదట్లోనే పొలాలు నీట మునగడంతో ఆర్థికంగా తీవ్ర నష్టం జరిగిందంటూ రైతులు వాపోతున్నారు.

**పొలాల్లోనే వర్షంనీరు**

ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో వరి పొలాల్లో భారీగా వర్షం నీరు నిలిచిపోయింది. ఉప్పలూరు, ఈడుపుగల్లు పరిధిలోని సుమారు 100 ఎకరాలు, మద్దూరు, కాసరనేనివారిపాలెం పరిసరాల్లో 160 ఎకరాల్లో వరి చేలు నీట మునిగాయి. పంట బోదెలు నీటితో నిండిపోయి పొలాల గట్లు మీదుగా ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వరి నాట్లు దాదాపు తుదిదశకు చేరాయి. ఇప్పటికే పొలాలు దమ్ము, వరి నారుతీత, వరి నాట్లు, ఒక విడత ఎరువులు వేయడానికి ఎకరాకు రూ. 15 వేలు నుంచి రూ. 20 వేలు వరకూ పెట్టుబడులు అయ్యాయి. మోస్తరు వర్షానికి పంట పొలాలు నీట మునిగి వరి నాట్లు దెబ్బతినడంతో పంటపై పెట్టిన పెట్టుబడులు నష్టపోయినట్టేనని రైతులు వాపోతున్నారు.



ఉప్పలూరు ప్రధాన రోడ్డు వెంబడి పొలాల గట్టు మీదుగా ప్రవహిస్తున్న పంట బోదె

**కాలువల నిర్వహణలో నిర్లక్ష్యం వల్లే నష్టం**

ప్రధానంగా పంట కాలువల్లో తూడు, వ్యర్థాల తొలగింపులు అంతా తూతూమంత్రంగా సాగాయి. చాలా పంట బోదెల్లో తూడు, వ్యర్థాలు కనిపిస్తున్నాయి. వ్యర్థాలు కారణంగా కొద్దిపాటి వర్షానికి, ప్రధాన కాలువల నుంచి నీటి మళ్లింపు కారణంగా బోదెలు నీటితో నిండిపోయి ప్రవహిస్తున్నాయి. దీంతో పొలాల్లో మురుగు బోదెల్లోకి వెళ్లే ఆస్కారం లేకుండా పోయింది. బోదెల్లో మురుగు పొలాల్లోకి ఎగబాకి పంట పొలాలను ముంచెత్తుతున్నాయి. ఫలితంగా అన్నదాతలు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు.

పెనమలూరు: గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నీట మునిగింది. ఒక్కసారిగా భారీ వర్షాలు కురవడంతో చోడవరం, వణుకూరు, పోరంకి ప్రాంతాల్లో డ్రెయినేజీ వసతులు సక్రమంగా లేక వరి పొలాలు నీట మునిగాయి. నాట్లు వేసి వారం రోజులు కూడా గడవక ముందే పంట నీట మునగడంతో నారు కుళ్లి పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**వర్షాలకు గ్రామాలు జలమయం**

గన్నవరం రూరల్: అధిక వర్షాలకు మండలంలోని గ్రామాలు జలమయం అయ్యాయి. గ్రామాల్లో డ్రెయిన్‌లు పొంగిపొర్లాయి. రోడ్లపై ఉన్న గోతులు వర్షం నీటితో నిండిపోయాయి. సూరంపల్లి, పురుషోత్తపట్నం, బీబీగూడెం, గొల్లనపల్లి తదితర గ్రామాల్లో వర్షాలకు ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడ్డారు.



మద్దూరులో నీట మునిగిన వరి పొలాలు

**రోడ్లపై చేరిన వర్షంనీరు**

రామవరప్పాడు: గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి రూరల్ మండలం పలు గ్రామాల్లోని అంతర్గత రహదారులు జలమయమయ్యాయి. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలతో పాటు అంతర్గత రహదారుల్లో వర్షంనీరు చేరింది. వర్షం నీటికి డ్రెయిన్ నీరు తోడవడంతో మోకాలిలోతు నీటిలో ఆయా ప్రాంతవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రామవరప్పాడు నుంచి నిడమానూరు వరకు జాతీయరహదారిపై భారీగా వర్షంనీరు నిలిచింది. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న డ్రెయిన్లు పొంగి మురుగునీరు రోడ్డుపైకి చేరుకోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.



ఈడుపుగల్లులో వరి చేలులో వర్షంనీరు



ప్రసాదంపాడులోని అంతర్గత రహదారిలో నిలిచిన వర్షంనీరు

**తీవ్ర నష్టం**



కొద్ది పాటి వానకే మద్దూరు, కాసరనేనివారిపాలెం పరిధిలో సుమారు 160 ఎకరాల్లో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. ఎకరాకు రూ. 15 వేలు వరకు పెట్టుబడులు పెట్టాం. వేసవిలో మురుగు బోదెలు, చెరువుల్లోకి నీటి మళ్లింపు అవకాశాలను రైతులకు అందుబాటులోకి తెస్తే సమస్య ఉండదు. గతేడాది రబీ, ఖరీఫ్‌లోనూ వర్షాల వల్ల నష్టపోయాం.

– యనమదల వెంకటేశ్వరరావు, కౌలురైతు, మద్దూరు

# బహుభాషా నటి సరోజ

విజయవాడ కల్చరల్: బహుభాషా నటి బి.సరోజ అని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పురుమూరి విజయలక్ష్మి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి సహకారంతో మహానటి సావిత్రి సంక్షేమ సంఘం సినీనటి సరోజ సంస్మరణ సభ, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సరోజ తెలుగులో అగ్రనటుల సరసన నటించిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆమె సినీరంగ సేవలను గుర్తించి పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించిందని తెలిపారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ మాట్లాడుతూ సరోజ మరణం తెలుగు సినీ రంగానికి తీరనిలోటు అన్నారు. వివిధ భాషల్లో 200కు పైగా చిత్రాల్లో ఆమె నటించిందని వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన కె.డేవిడ్‌రాజు, చింతకాయల చిట్టిబాబు, బి. వీరభద్రరావు, కొప్పుల ఆనంద్ పాల్గొన్నారు. అతిథులు సరోజ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాయనీ గాయకులు శిరీష, విష్ణుప్రియ, లక్ష్మణ్ నాయక్, కె.రత్నకుమారి, వి.కామేశ్వరి, బి. సరోజ, సావిత్రి చిత్ర గీతాలను ఆలపించారు.



సరోజ సంస్మరణ సభలో పాల్గొన్న అతిథులు, విజయలక్ష్మి తదితరులు

# ఆకట్టుకున్న హాసిని నృత్య ప్రదర్శన



విజయవాడ కల్చరల్: నాట్యాచార్యుడు మల్లికా రాంప్రసాద్ నృత్య పర్యవేక్షణలో ప్రవాసాంధ్ర నృత్య కళాకారిణి హాసిని కూచిపూడి నాట్యరంగ ప్రవేశం బందురురోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం మనోహరంగా సాగింది. గణేశస్తుతి, స్వరజతి, భామా కలాపం, అన్నమాచార్యుల కీర్తనలకు నృత్యాలను అభినయించింది. దూరదర్శన్ విశ్రాంత ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ సాంప్రదాయ నృత్యాలను పరిరక్షించుకోవాలని తెలిపారు. కూచిపూడి గ్రామం పేరుతో ఏర్పడిన కూచిపూడి నృత్యం నేడు ప్రపంచం దృష్టిని ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. నాట్యాచారుడు మల్లికా రాంప్రసాద్ మాట్లాడుతూ గురుసేవలో తరించాలని సూచించారు. నాట్యకళాకారిణి వేములపల్లి సురేష్‌బాబు, నాగశివానీలు అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో వేములపల్లి బసవ శంకరరావు, పార్వతి, ముప్పా శ్రీనివాసరావు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.